క్లుప్తంగా

ఘనంగా బ్రహ్మోత్సవ పూజలు



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీచక్ర లక్ష్మీదేవి హోమ పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, బిక్కి మురళీ, గిరగాని నర్సయ్య, పసునూరి వెంకన్న, ఎలంశెట్టి ప్రసాద్ దంపతులతోపాటు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణ ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని అట్టహాసంగా జరిపించారు.

సన్మానం



నర్సంపేట : ఆర్టీసీ బస్సుల్లో తరచూ ప్రయాణం చేసిన నర్సంపేటకు చెందిన చల్ల సోమనర్సయ్యను, కమలాపురం మండలానికి చెందిన ముత్తినేని శ్రీలతను స్థానిక డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శుక్రవారం పుష్పాలు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం డిపో ఉద్యోగులతో మాట్లాడారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్ యాదగిరిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోశ్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల దహనంలో జాగ్రత్తలు తీసుకోవాలి



దుగ్గొండి : పంట పొలాలలో వ్యర్థాలను దహనం చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు రైతులను కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మొక్కజొన్న, వరి, పత్తి పంటల్లోని వ్యర్థాలైన కొయ్యకాలు, పత్తి కర్ర, ఎండుగడ్డికి నిప్పు పెట్టే సమయంలో అజాగ్రత్తగా ఉండొద్దని సూచించారు. పక్క పొలాల్లో నిల్వ చేసిన పంటలు కాలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇతరులకు నష్టం కలిగిస్తే కేసులు తప్పవని స్పష్టం చేశారు.

ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలను ప్రోత్సహించాలి



పర్వతగిరి : ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాలను ప్రోత్సహించాలని స్థానిక మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం వెంకటరమణారెడ్డి కోరారు. ఆ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతరులు వారి పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించేలా చొరవ చూపాలని సూచించారు. తద్వారా ప్రభుత్వ స్కూళ్లు బలోపేతం అవుతాయని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం రమేశ్ బాబు, ఏఏపీసీ చైర్‌పర్సన్ నీరటి జ్యోతి, ఉపాధ్యాయులు లలితదేవి, సుభాషిణి, రామస్వామి, నవీన్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన ఐత సిద్ధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయనకు వైద్యం కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం రూ.10 వేల సాయం అందించారు. అనంతరం మండలంలోని జింకురాంతండా పరిధిలోని పీక్లతండాకు చెందిన భూక్య శంకర్, మాలోతు మూన్యా ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం, ఆయిల్ క్యాన్, ఇతర సరుకులు పంపిణీ చేశారు. తొలుత బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మీజ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి మాట్లాడారు. మండలంలోని పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్; బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి, నాయకులు కర్ర రవీందర్‌రెడ్డి, పున్నమయ్య, గుగులోతు సుందర్, గారె నర్సయ్య, ఐత రాంచందర్, రాము, ఐత రాజు, జాటోతు అనిల్, దూంసింగ్, గుగులోతు శ్రీనివాస్, ఠాకూర్, యాకూబ్, తిరుపతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాలతో సందడి

● మండలంలోని 5 స్కూళ్లలో నిర్వహణ

నర్సంపేట రూరల్ : ఉచిత వేసవి శిక్షణ శిబిరాలతో పల్లెల్లో సందడి నెలకొంది. మండలంలోని 7 ప్రభుత్వ స్కూళ్లను 15 రోజులపాటు వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణకు విద్యాశాఖ ఎంపిక చేసింది. ఈ క్రమంలో విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి బాటలు వేయడంతోపాటు విజ్ఞానం, వినోదం పంచేలా శిబిరాలు కొనసాగుతున్నాయి.

నర్సంపేటలోని బాలుర జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్‌తోపాటు లక్నెపల్లి, గురిజాల, మహేశ్వరం గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈనెల 19వ తేదీ వరకు శిబిరాలు కొనసాగనున్నాయి. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌తోపాటు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, చదరంగం, పెయింటింగ్, డ్రాయింగ్, కరాటే, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, డాన్స్, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. రోజూ సుమారు 30–40 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా శనిగలు, పల్లీలు, పల్లిపట్టీలు, అరటి పండ్లు, తదితర అల్పాహారం అందిస్తోంది.

'ప్రైవేట్'కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించడం ఆనవాయితీగా ఉండేది. ప్రభుత్వ విద్యా శాఖ జెడ్పీ, మండల పరిషత్ స్కూళ్లలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తూ విద్యార్థుల ఉన్నతికి బాటలు వేస్తోంది. విద్యార్థులకు అల్పాహారం సైతం అందిస్తుండడంతో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో శిబిరాలకు విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరవుతూ నైపుణ్యం పెంచుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ విద్యార్థుల శారీరక, వికాసానికే కాకుండా చదువుల్లో రాణించేలా దోహదం చేస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు



డ్రాయింగ్‌లో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయురాలు

నైపుణ్యం పెంపునకు బాటలు



శిక్షణా శిబిరాలు విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు బాటలు వేస్తున్నాయి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి పెంచేలా శిబిరాల్లో శిక్షణ లభిస్తోంది. క్రికెట్, డ్రాయింగ్, కరాటే లాంటి అంశాల్లోనే కాకుండా స్పోకెన్ ఇంగ్లిష్‌లోనూ విద్యార్థులు పట్టు సాధిస్తున్నారు.

– సత్యనారాయణ, ఉపాధ్యాయుడు

ప్రతిభ వెలికితీసేలా శిక్షణ



విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ప్రణాళికాయుతంగా శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల నుంచి ఏదైనా ఆసక్తి ఉన్న రంగంలో విద్యార్థులు రాణించే అవకాశాలు మెరుగు పడుతున్నాయి. పాటలు, డ్యాన్స్, తదితర అంశాల్లో శిక్షణ పేద విద్యార్థులకు చక్కటి అవకాశం.

– కొర్ర సారయ్య, ఎంఈఓ

అవగాహనతో డెంగీ నివారణ



నర్సంపేట : ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ సరోజ, వైద్య సిబ్బంది

● వైద్యాధికారి సరోజ

నర్సంపేట : అవగాహనతో డెంగీ నివారణకు బాటలు వేయొచ్చని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి సరోజ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా చెన్నారావుపేటలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఆమె మాట్లాడారు. ప్రజలు డెంగీ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. దోమ కాటుతో డెంగీ సోకే అవకాశం ఉందన్నారు. అధిక జ్వరం, తీవ్రమైన కీళ్లనొప్పులు, కండరాల ఇబ్బందులు, చర్మంపై దద్దుర్లు, తదితర లక్షణాలతో బాధపడే ప్రజలు సత్వరమే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజయ్య, సూపర్‌వైజర్లు రామెల్, కీర్య, ప్రేమలత, సిబ్బంది ఎస్తేర్, హేమలత, తదితరులు పాల్గొన్నారు



ఖానాపురంలో..

ఖానాపురం : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓలు రాజయ్య, లీల, సబ్ యూనిట్ ఆఫీసర్ నదం, సిబ్బంది దామోదర్‌రెడ్డి, దేవిక, సబిత, చిన్ని, శ్రీనివాసచారి, భాస్కర్, భద్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

● సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యదర్శి సూరి

వర్ధన్నపేట : జూలై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో కార్మిక, కర్షక జీవన ప్రమాణాలు పడిపోయాయని ఆందోళన వెలిబుచ్చారు. అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వాలు ఇష్టారీతిన పెంచుతున్నాయని చెప్పారు. శ్రామికులకు తగిన వేతనాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లుగా సవరించి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని చెప్పారు. సార్వత్రిక సమ్మెలో కార్మికులు, కర్షకులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు మైదం పాణి, సాబిరికాని మోహన్, కుమారస్వామి, చందు, నర్సింహస్వామి, రాములు, ప్రకాశ్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇన్‌చార్జ్ ఎంఈఓగా శ్రీనివాస్



రాయపర్తి : ఇన్‌చార్జ్ ఎంఈఓగా మండలంలోని ఊకల్ ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెన్నంపల్లి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎంఈఓగా పని చేసిన నోముల రంగయ్య ఉద్యోగ విరమణ నేపథ్యంలో మూడు నెలలుగా వర్ధన్నపేట ఎంఈఓ శ్రీధర్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో వెన్నంపల్లి శ్రీనివాస్‌ను ఉన్నతాధికారులు ఎంఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్‌సీ) సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలువాల శ్రీనివాస్, సీసీఓ జేరిపోతుల యాకయ్య, మెసెంజర్ ఐత శ్రీనివాస్, సీఆర్పీ వెంకన్న పాల్గొన్నారు.

సమన్వయంతోనే సంఘాల అభివృద్ధి

● సహ వికాస సంస్థ అధ్యక్షురాలు జయప్రద

సంగెం : సభ్యుల నడుమ సమన్వయంతోనే సహకార సంఘాలు అభివృద్ధి సాధించగలవని సహ వికాస సంస్థ అధ్యక్షురాలు కాసర్ల జయప్రద తెలిపారు. మండలంలోని గవిచర్లలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆంజనేయ పురుషుల పొదుపు పరస్పర సహాయక సహకార సమితి ప్రథమ వార్షికోత్సవ మహాసభను శుక్రవారం నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ఆదాయం నుంచి కొంత పొదుపు చేయడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతినెలా నియమిత పొదుపు చేసుకుంటే భవిష్యత్తుకు ధీమా ఉంటుందని చెప్పారు. సమితి పరిధిలోని 5 పొదుపు సంఘాల్లో 3383 మంది సభ్యులుండగా పొదుపు రూ.5.29 కోట్లు కాగా బోనస్ రూ.7.90 కోట్లు వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గుండెబోయిన ఎల్లాగౌడ్, మేనేజర్ లక్ష్మణ్, డీఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు జయప్రద

హనుమాన్ మాలధారుల పాదయాత్ర



నెక్కొండ : పాదయాత్ర చేస్తున్న హనుమాన్ మాలధారులు

నెక్కొండ : మండలంలోని దీక్షకుంటకు చెందిన హనుమాన్ స్వాములు మాల విరమణ కోసం భద్రాచలంకు చేపట్టిన పాదయాత్ర మండల కేంద్రానికి శుక్రవారం చేరుకుంది. ఈ సందర్భంగా గురుస్వాములు కోల ప్రవీణ్, అక్కినపల్లి వెంకట్, ఆలకుంట సురేందర్ మీడియాతో మాట్లాడారు. బాల హనుమాన్ జయంతి ముందు నుంచే తామంతా మాలధారణ చేశామన్నారు. ఆరు రోజులపాటు సుమారు 185 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర సాగుతుందని చెప్పారు. ఈనెల 22న హనుమాన్ జయంతి నాడు పాదయాత్ర భద్రాచలం చేరుకుంటుందని తెలిపారు. పాదయాత్రలో హనుమాన్ స్వాములు అక్కినపల్లి సిద్ధార్థ, కూస సాంబనర్సయ్య, పొనకంటి స్వామి, మనుబోతుల శివాజీ, మండల మహేశ్, అన్వేశ్, హరిసాథ్, తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు ..

దుగ్గొండి : మండలంలోని పొనకల్‌కు చెందిన హనుమాన్ మాలధారులు వనపర్తి రవీందర్, అభినయ్, నర్మెట్ట రాజేశ్ 41 రోజుల హనుమాన్ దీక్ష ముగిసిన సందర్భంగా శుక్రవారం ఉదయం ఇరుముడి కట్టుకుని కొండగట్టుకు పాదయాత్రగా బయల్దేరారు. పాదయాత్ర గీసుగొండలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, వేములవాడ మీదుగా ఈనెల 21 సాయంత్రానికి కొండగట్టుకు చేరుకుంటుంది. అనంతరం 22న హనుమాన్ జయంతి సందర్భంగా మాలవిరమణ చేయనున్నట్లు మాలధారులు తెలిపారు.

అన్నదానం

నర్సంపేట : మండలంలోని జల్లిలో హనుమాన్ మాలధారులకు అమీనాబాద్ సొసైటీ డైరెక్టర్ భూక్య హుస్సేన్ నాయక్, నాయకులు దొంతర బోయిన కొమ్మాలు, ఎన్‌హెచ్ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేశ్ శుక్రవారం అన్నదానం చేశారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఆర్‌సీ చెన్నారావుపేట మండల కమిటీ సభ్యులు నూనె తిలక్, వెంకటేశ్వర్లు, నరేశ్, సాత్విక్, కొంకాల రాంచరణ్, బిట్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులపై కేసు నమోదు చేయాలి

నర్సంపేట : నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లికి చెందిన కొమ్మాలును హత్య చేసిన ఘటనలో అనుమానితులపై కేసు నమోదు చేయాలని కొమ్మాలు సతీమణి కవిత, కుమారులు మోహన్, యశ్వంత్ కోరారు. ఈ మేరకు వారు పట్టణంలోని కార్యాలయంలో ఏసీపీ పున్నం రవీందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కవిత, ఆమె కుమారులు ఏసీపీతో మాట్లాడారు. కొమ్మాలును మక్కజొన్న చేనుకు పిలిచి కిరాతకంగా హత్య చేశారని తెలిపారు. హత్యకు పాల్పడిన దంపతులను మాత్రమే పోలీసులు అరెస్ట్ చేశారని, మరో ముగ్గురు అనుమానితులను వదిలేశారని చెప్పారు. అనుమానితులపైనా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని కోరారు.

బాధితులకు సేవలే 'సఖి' లక్ష్యం

● కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న

నెక్కొండ : ఇబ్బందుల్లో ఉన్న మహిళలు, వయోవృద్ధులు, దివ్యాంగులు, బాలికలకు సేవలు అందించడమే లక్ష్యంగా సఖి కేంద్రాలు పని చేస్తున్నాయని వరంగల్ సెంటర్ కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న తెలిపారు. మండలంలోని గొల్లపల్లిలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మహిళా సంఘాల సభ్యులకు, ఉపాధి హామీ కూలీలకు వారు అవగాహన కల్పించారు. మహిళల, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలను నిర్వహిస్తున్నాయని చెప్పారు. బాధితులకు ఉచితంగా కౌన్సిలింగ్ చేయడంతోపాటు పోలీస్, న్యాయ, వైద్య సాయం అందుతాయని తెలిపారు. తాత్కాలిక వసతి సైతం లభిస్తుందని వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో, సమస్యల్లో చిక్కుకుని బయటకు రాలేని మహిళలు హెల్ప్ లైన్ 181కు ఫోన్ చేసి రక్షణ పొందాలని సూచించారు. అలాగే సమస్యల్లో ఉన్న వృద్ధులు 14567, బాలికలు 1098కు సమాచారం అందించి సేవలు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఐకేపీ సీసీ శారద, వీఓఏ సదానందచారి, ఎఫ్ఏ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తిరుమల, స్వప్న

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

● ఏసీపీ సతీశ్‌బాబు

పరకాల : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు విక్రయించాలని ఏసీపీ సతీశ్‌బాబు డీలర్లకు స్పష్టం చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశానికి వెన్నుముక అయినటువంటి రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. విత్తన చట్టం1966, ఎఫ్‌సీఓ 1985, పురుగు మందుల చట్టం 1968 ప్రకారం విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలను ధిక్కరించి రైతులను మోసం చేయాలని చూస్తే సంబంధిత డీలర్లపై, వ్యాపారస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పరకాల ఇన్‌చార్జ్ ఏడీఏ, ఏఓ శ్రీనివాస్, ఎస్‌హెచ్ఓ క్రాంతికుమార్, వివిధ మండలాల వ్యవసాయాధికారులు యాదగిరి, గంగాజమున, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్‌బాబు

18న వరంగల్‌లో ర్యాలీ



నర్సంపేట : వక్ఫ్ బోర్డు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న వరంగల్‌లో ర్యాలీ నిర్వహించనున్నట్లు ముస్లిం మైనార్టీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు మహ్మద్ అయ్యూం తెలిపారు. మండలంలోని పాతమగ్దుంపురంలోని మజీదే మహ్మదీయ మసీదులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18న ర్యాలీ సందర్భంగా సాయంత్రం 6.30 గంటలకు ఇస్లామియా కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. తొలుత కరపత్రాలను ప్రదర్శించారు. సమావేశంలో నాయకులు షేక్ ఇమామ్, మహ్మద్ ఇజాజ్ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

శాయంపేట : మండలంలోని కొప్పులలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1996–1997 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు గుడెప్పాడ్‌లోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో, మెమొంటోలతో సత్కరించారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, శ్రీనివాసాచారి, ఉమామహేశ్వర్, రాజమల్లయ్య, మోహన్‌రెడ్డి, సమ్మయ్య, మహిముద్దీన్, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణ రెడ్డి, మాజీ విద్యాకమిటీ చైర్మన్ తడుక రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన దానం శంకరయ్య (75) ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందగా ఆయన నేత్రాలను బాధిత కుటుంబం హైదరాబాద్‌లోని ఎల్‌వీ ఆస్పత్రికి దానం చేసింది. శంకరయ్య నేత్రాలను వారి కుమార్తెల అంగీకారంతో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ట్రస్టు నేత్ర వైద్య నిపుణుడు నరేందర్ సేకరించి భద్రపర్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ మాట్లాడారు. నేత్రదానం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శంకరయ్య కుటుంబీకులను గ్రామస్తులు అభినందించారు.

టీబీ బాధితుడి ఆత్మహత్య



హన్మంతు (ఫైల్)

గీసుకొండ : టీబీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన గొడుగు హన్మంతు (38) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. హన్మంతు కొన్నేళ్లుగా టీబీతో బాధపడుతున్నారు. టీబీ ఆస్పత్రిలో చేర్పినా వ్యాధి నయం కాలేదు. చికిత్స నిమిత్తం డబ్బులు లేకపోవడంతో శుక్రవారం ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ మహేందర్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సారయ్య

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని పెద్దకోడెపాక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మాలోతు సారయ్యనాయక్ తెలిపారు. మండలంలోని పెద్దకోడెపాక, జోగంపల్లి గ్రామాల్లో శుక్రవారం బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడారు. దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రూ.6 వేల రవాణా భత్యం కూడా ప్రభుత్వం ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కొండ సాత్విక 528, ఎస్.శివకుమార్ 498, తృతీయ స్థానంలో టి.అన్వేష్, ఎం.సంగీత్‌కుమార్ 481 మార్కులు సాధించినందుకు వారిని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అన్న వసంత, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

దామెర : మండలంలోని తక్కళ్లపహాడ్‌లో మహిళా సంఘాలతో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. ములుగు మండలంలోని దేవగిరిపట్నం మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ఓగ్లాపూర్ సమీపంలోని సైలానీబాబా దర్గాలో ప్రచారం నిర్వహించారు. దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ అమీద్ చేతులమీదుగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

ఆత్మకూరు : పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెండెం రాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అలాగే గ్రామంలో పిల్లల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

గీసుకొండ : పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని గొర్రెకుంటలో బోనాల అశోక్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పార్టీ శాఖ రెండో మహాసభకు రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేదల హక్కుల సాధన, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ పోరాటాలు నిర్మిస్తోందని తెలిపారు. ఐక్యపోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. సభలో నాయకులు కమలమ్మ, తోట చంద్రకళ, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.